నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, మంగళవారం 13 ఫిబ్రవరి 2024 | NIRMAL

# అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

**- నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 12 : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో జాప్యం చేయవద్దని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజన్ అహ్మద్‌లతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు అర్జీలను స్వీకరించిన కలెక్టర్ వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం 37 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, డీఆర్వో లోకేశ్వర్ పాల్గొన్నారు.

# వేడుకలు ప్రారంభం

**- మొదటి రోజు వసంత పంచమి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే**


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

బాసర, ఫిబ్రవరి 12 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో సోమవారం వసంతోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు ఈవో విజయరామారావు, చైర్మన్ శరత్‌పాఠక్‌లు ఉత్సవాలను ప్రారంభించారు. అమ్మవారిని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మొదటి రోజు భక్తులు తరలిరావడంతో అధికారులు ఏర్పాట్లు చేశారు. రేపటి(బుధవారం) వరకు వేడుకలు కొనసాగనున్నాయి.


జడ్పీ సీఈవో తవీ గణపతి


శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి


రాజేశ్వర్, డిప్యూటీ జడ్పీ సీఈవో


డీఆర్‌డీవో ఎస్ కిషన్

# అధికారుల బదిలీ

**జడ్పీ సీఈవో, డీపీవో, డీఆర్‌డీవోతోపాటు పలువురికి స్థానచలనం**

ఆదిలాబాద్, ఫిబ్రవరి 12(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా పలు శాఖల్లో పనిచేస్తున్న అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. స్థానచలనం పొందిన వారిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన అధికారులు ఉన్నారు. జిల్లా పరిషత్ సీఈవో గణపతి మంచిర్యాల జడ్పీ సీఈవోగా బదిలీ అయ్యారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జడ్పీ సీఈవో రత్నమాల ఆదిలాబాద్ జడ్పీ సీఈవోగా రానున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిగా పనిచేస్తున్న కిషన్ మంచిర్యాల డీఆర్‌డీవోగా బదిలీ అయ్యారు. కామారెడ్డిలో డీఆర్‌డీవోగా విధులు నిర్వహిస్తున్న సాయన్న ఆదిలాబాద్ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిగా బదిలీపై రానున్నారు. ఆదిలాబాద్ జడ్పీలో డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్న రాథోడ్ రాజేశ్వర్ పెద్దపల్లి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిగా బదిలీ అయ్యారు. అడిషనల్ డీఆర్‌డీవోగా విధులు నిర్వహిస్తున్న రాథోడ్ రవీందర్ మంచిర్యాల అడిషనల్ డీఆర్‌డీవోగా బదిలీ అయ్యారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్న కుటుంబరావు ఆదిలాబాద్ అడిషనల్ డీఆర్‌డీవోగా బదిలీపై రానున్నారు. జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న పాతకోటి శ్రీనివాస్ నిర్మల్ డీపీవోగా బదిలీ అయ్యారు. నిర్మల్ జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న శ్రీలత ఆదిలాబాద్ డీపీవోగా రానున్నారు. బదిలీ అయిన అధికారులను సోమవారం రిలీవ్ చేయాలని, వారు తమకు కేటాయించిన జిల్లాల్లో మంగళవారం జాయిన్ కావాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశాలు జారీ చేశారు.

## నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 12 : నిర్మల్ జిల్లాలో పని చేస్తున్న ఇద్దరు జిల్లా అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కార్యదర్శి ఉత్తర్వులను జారీ చేశారు. నిర్మల్ జిల్లా పరిషత్ సీఈవోగా పనిచేస్తున్న సుధీర్‌కుమార్‌ను వికారాబాద్ జిల్లాకు.. నిజామాబాద్ జిల్లాలో పనిచేస్తున్న గోవింద్‌ను నిర్మల్ జిల్లాకు బదిలీ చేశారు. మెదక్ జిల్లాలో పనిచేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి రజాక్‌ను నిర్మల్ జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# ప్రవీణ్‌కు వీడ్కోలు

- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- పాల్గొన్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ గౌష్ఆలం
- నార్నూర్ మండలంలోని రాజుల్‌గూడలో విషాదఛాయలు


నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

నార్నూర్, ఫిబ్రవరి 12 : నార్నూర్ మండలంలోని మాన్కాపూర్ పంచాయతీ పరిధిలో గల రాజుల్‌గూడ గ్రామానికి చెందిన ఆడే ప్రవీణ్ (35) అంత్యక్రియలు అధికారికలాంఛనాలతో నిర్వహించారు. తెలంగాణ పోలీసుశాఖకు చెందిన గ్రేహౌండ్స్ కమాండో ప్రవీణ్ భూపాలపల్లి జిల్లా గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని నస్తుర్‌పల్లి అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి కూంబింగ్ నిర్వహిస్తున్నారు. అమర్చిన కరెంట్ తీగలు తాకి విద్యుత్‌షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందా డు. సోమవారం ఉదయం నార్నూర్ మండలంలోని రాజుల్‌గూడలో అంత్యక్రియలు నిర్వహించారు. స్వగృహం నుంచి నార్నూర్ గాంధీ చౌరస్తా మీదుగా మాన్కాపూర్ గ్రామ సమీపంలోని శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర కొనసాగింది. మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌష్ ఆలం పాల్గొని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రవీణ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అలాగే జిల్లాలోని ఆయాశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తరలివచ్చారు.


ప్రవీణ్ పార్థివదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

# పదోన్నతులు కల్పించాలి..

సారంగాపూర్, ఫిబ్రవరి 12 : జామ్ బాలికల గురుకులంలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు పదోన్నతులు కల్పించాలని కోరుతూ సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 317 జీవోను ప్రభుత్వం అమలు చేయకుండానే కొత్తవారికి నియామక పత్రాలు అందిస్తే, గురుకులాల్లో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందన్నారు. ఈనెల 14వ తేదీన కొత్తవారికి నియామక పత్రాలు ఇవ్వక ముందే.. జీవో 317 సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలన్నారు. ఇందులో ఉపాధ్యాయులు ఫాతిమా, స్వప్న, రాజేశ్వరి, సంధ్యారాణి, స్వరూపారాణి, ప్రవళిక, ప్రవీణ, సుప్రియ పాల్గొన్నారు.


జామ్ బాలికల గురుకులంలో నిరసన తెలుపుతున్న సీనియర్ ఉపాధ్యాయులు

# గిరిజనుల కష్టాలు తెలుసు


దర్బార్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

**జిల్లాను పర్యాటకంగా బాగా అభివృద్ధి చేస్తాం..**

- దర్బార్‌ను తెలిపేలా శిలాఫలకం ఏర్పాటు చేయాలి..
- పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- ప్రజా దర్బార్‌కు తరలివచ్చిన గిరిజనులు
- నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు
- మంత్రి, ఎమ్మెల్యేలను సన్మానించిన మెస్రం వంశీయులు


దర్బార్‌లో పాల్గొన్న గిరిజనులు

ఉట్నూర్/ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 12 : ఏజెన్సీ ప్రాంతాల్లో ఉండే అమాయక గిరిజనుల, ప్రజల కష్టాలు బాగా తెలుసు అని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతరలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా.. మెస్రం వంశీయులు మంత్రి, ఎమ్మెల్యే, అధికారులను సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గిరిజనుల సమస్యలు బాగా తెలుసు కనుకనే ఈ జిల్లాకు ఇన్‌చార్జిగా సీఎం రేవంత్‌రెడ్డి నియమించారన్నారు. రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి జరగలేదన్నారు. అందుకే సీఎం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నారన్నారు. జిల్లాలో కల్మషం లేని గిరిజన జాతులు, సహజ వనరులు, పర్యటక కేంద్రాలు చాలా ఉన్నాయని తెలిపారు. అందుకే పర్యటకంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ దర్బార్ ఏర్పాటుకు కారణాలు తెలుపుతూ శిలాఫలకం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## సమస్యలను పరిష్కరించాలి..

**- ఆదిలాబాద్ ఎంపీ బాపురావు**

గిరిజనులు పెండ్లి కోసం పొరక తెచ్చుకుందామన్న, తునికాకు సేకరణతో ఉపాధి పొందుదామన్న అటవీ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ ప్రాంత ప్రజలు రేవంత్‌రెడ్డిపై నమ్మకంతో గెలిపించినందున వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే ఉన్నత చదువులు చదివేందుకు గిరిజన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

## గిరిజనుల సంస్కృతి చాలా గొప్పది..

**- మాజీ ఎంపీ నగేశ్**

గిరిజనుల సంస్కృతీ, సంప్రదాయాలు చాలా గొప్పవన్నారు. గిరిజన యువతకు సంప్రదాయాలు సహజంగానే అబ్బుతాయని, విద్యలో మాత్రం వెనుకబడి ఉన్నారన్నారు. నాగోబా ఆలయాభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన విషయాన్ని వివరించారు. ఆలయానికి నిరంతరం భక్తులు వస్తున్నందున సౌకర్యాలు మెరుగుపర్చాలని కోరారు. ఎండోమెంట్ నుంచి రూ.50 లక్షలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## యూనివర్సిటీలు అవసరం..

**- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు**

దేశంలోనే రెండో అతిపెద్ద జాతర అయిన నాగోబాను అభివృద్ధి చేసుకోవడం ప్రభుత్వ విధి అన్నారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన యూనివర్సిటీ ములుగుకు తరలిపోయినందున, ఈ ప్రాంతంలో నర్సింగ్, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటునకు కృషి చేయాలని మంత్రిని కోరారు. టీ హబ్‌ను ఉట్నూర్ కేంద్రంగా ప్రారంభించామని, ఇక్కడే 100 రకాల పరీక్షలు జరుగుతాయన్నారు. ఆదిలాబాద్ కేంద్రంగా ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వైద్యులను నియమించాలని కోరారు.

## ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నాం..

**- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్**

జిల్లాను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్య, వైద్యం, రవాణా, నీటి వసతి, రోడ్ల నిర్మాణం వంటి వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా సాగుతున్నామని తెలిపారు. అర్హులను ఎంపిక చేస్తూ పథకాలను అందిస్తున్నామన్నారు.

## ఫ్రెండ్లీ పోలీస్ కొనసాగుతున్నది..

**- ఎస్పీ గౌష్ ఆలం**

గతంలో పోలిస్తే ప్రస్తుతం ఫ్రెండ్లీ పోలీస్ కొనసాగుతుందన్నారు. జాతరకు 500 మంది పోలీస్ సిబ్బందిని నియమించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, ఇంద్రవెల్లి జడ్పీటీసీ సంగీత, ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, డీడీ దిలీప్ కుమార్, బీఈడీ ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, రాయి సెంటర్ జిల్లా మేడి మెస్రం దుర్గు, కుమ్రం భీం మనవడు సోనేరావు, తొమ్మిది తెగల నాయకులు, గిరిజన పెద్దలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆదివాసుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నాగోబా జాతర సందర్భంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణ కేంద్రంలో దర్బార్‌కు వచ్చిన ఆదివాసులు వ్యక్తి రుణాలతోపాటు వివిధ రకాల సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తులను అధికారులు శాఖలవారీగా తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.


గోవాడ్‌లో మెస్రం వంశీయుల కొత్తకోడళ్ల తో మాట్లాడుతున్నమంత్రి సీతక్క


నాగోబాకు పూజలు చేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ సోయం బాపురావ్


నాగోబా దర్శనానికి తరలివస్తున్న భక్తులు

# సిబ్బంది లేక ఇబ్బంది..

**ఉపాధి హామీ పథకంలో భర్తీకి నోచుకోని ఖాళీలు**

- ఒక్కో ఎఫ్‌ఏకు ఎనిమిది వరకు పంచాయతీల విధులు
- పనుల కేటాయింపుపై తీవ్ర ప్రభావం
- సిబ్బందిని నియమించాలని కూలీల వేడుకోలు


పని ప్రదేశంలో కొలతలు తీసుకుంటున్న టీఏ పోశెట్టి

సారంగాపూర్, ఫిబ్రవరి 12 : గ్రామీణ ప్రాంతాల్లో పేదల వలసలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నది. మొదట్లో పనుల నిర్వహణను పరిశీలించేందుకు ప్రతి పంచాయతీకి ఒక ఫీల్డ్ అసిస్టెంట్(ఎఫ్ఏ)ను నియమించింది. కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో ఎఫ్ఏలతోపాటు ఇతర సిబ్బంది లేక పనిదినాలు దొరకక కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ఫలితంగా సీనియర్ మేట్లపై పనిభారం అధికమవుతున్నది. దీంతో పనులు చూపించడంలోనూ జాప్యం జరుగుతున్నది. ఉపాధి పనుల కల్పన, పర్యవేక్షణ, కొలతల నిర్వహణ, ఆన్‌లైన్‌లో కూలీల వివరాల నమోదు, బిల్లుల చెల్లింపు వంటి అదనపు పనులు చేయడానికి సిబ్బంది లేకపోవడంతో పనులు పెండింగ్ పడుతున్నాయి. కొత్త పంచాయతీల్లో ఎఫ్ఏలు లేకపోవడంతో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి.

**265 రకాల పనులు..**

ఉపాధి హామీ పథకంలో 265 పనులు చేపట్టే అవకాశం ఉంది. స్థానిక పరిస్థితులను బట్టి అధికారులు పనులను ఎంపిక చేస్తారు. ముఖ్యంగా పంచాయతీ, అంగన్‌వాడీలు, ఇంకుడు, చిన్ననీటి కుంటలు, చెక్‌డ్యామ్‌లు, కాలువల పూడికతీత, పశువుల పాకలు, పశుగ్రాసం, పండ్ల తోటలు, పొలం గట్లపై టేకు చెట్లు, బంజరు భూములను సాగుకు యోగ్యంగా మార్చడం వంటి పనులు ఉన్నాయి. ఇక సామాజిక పనులైన సీసీ, మట్టి రోడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి, హరిత నర్సరీల నిర్వహణ, హరితహారంలో నాటిన మొక్కల పెంపకం వంటివి చేపడుతారు. వీటి నిర్వహణనను ఏపీవో, ఈసీ, టీఏలు చూసుకుంటారు. రోజువారీ పనులకు వచ్చే కూలీలకు చెల్లింపులు, సమన్వయం చేయడం, పరిపాలన వ్యవహారం చూసుకోవడం వంటి బాధ్యతలను ఏపీవో చూస్తాడు. టీఏలు పనికి వచ్చే కూలీలతో కొలతల ప్రకారం పని చేయిస్తారు. చేసిన పనిని లెక్కించి మస్టర్‌లు నమోదు చేస్తారు. క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించే ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత ఉంది. గతంలో ఉన్న పాత పంచాయతీల ప్రకారమే ఫీల్డ్ అసిస్టెంట్లు కొనసాగుతున్నారు. కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో ఎఫ్ఏలను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం కొంత మంది ఎఫ్ఏలు ఒక్కొక్కరు రెండు నుంచి నాలుగు పంచాయతీల బాధ్యతలు చూస్తున్నారు. టీఏలు ఒక్కొక్కరూ ఆరు నుంచి ఎనిమిది పంచాయతీలను చూస్తున్నారు. మార్చి నుంచి జూన్ వరకు ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతుంటాయి. గతేడాది వేసవిలో సారంగాపూర్ మండలంలో 9,679 కుటుంబాలకు 15,642 మంది కూలీలు ఉపాధి పనులను వినియోగించుకున్నారు.

**ఖాళీలు ఇలా..**

సారంగాపూర్ మండలంలో 32 జీపీలున్నాయి. ఇందులో 18,236 జాబ్‌కార్డులు ఉండగా.. 35,503 మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం 18 మంది ఎఫ్ఏలు, ఐదుగురు టీఏలు, ఒక ఈసీ, ఏపీవో పని చేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన 14 గ్రామ పంచాయతీలకు 14 మంది ఫీల్డ్ అసిసెంట్లు, టీఏ ఒకటి చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

### ఎనిమిది గ్రామాలను చూస్తున్నా..



సారంగాపూర్ మండల పరిధిలో 32 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఐదుగురు టెక్నికల్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. ఒక్కొక్కరు 6,8 పంచాయతీల బాధ్యతలు చూడాల్సి వస్తున్నది. నేను ఒక్కడినే ఎనిమిది పంచాయతీల బాధ్యతలను నిర్వహిస్తున్నా. కూలీలకు సరైన సమయంలో పనులు కల్పించడంలో, కొలతలు చేయడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం కొంత మేర సిబ్బందిని నియమిస్తే బాగుంటుంది.

**- పోశెట్టి, టీఏ, సారంగాపూర్ మండలం**

### పని భారంతో సతమతం..



ఉపాధి పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కీలకంగా వ్యవహరిస్తారు. కూలీలను రప్పించడంతోపాటు పనుల పర్యవేక్షణ బాధ్యతలు ఉంటాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు తగ్గట్టు ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. ప్రభుత్వం గతంలో పాత జీపీల పరిధిలో పనిచేసిన వారినే కొత్త పంచాయతీలకు వినియోగిస్తున్నది. అదనపు పనిభారంతో నిత్యం సతమతమవుతున్నాం. నేను జామ్, యాకర్‌పల్లి, మహావీర్‌తండా, హన్మాన్‌తండా జీపీలను చూస్తు న్నా. ఇబ్బందిగా ఉంది.

**- నాగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్, జామ్**

# ‘వడగండ్ల’ నష్టం


గోధుమ పంట

**నేల కొరిగిన గోధుమ, మక్క, జొన్న పంటలు**

తానూర్, ఫిబ్రవరి 12 : మండల కేం ద్రంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానతో పంటలు నేలకొరిగాయి. మక్క, గోధు మ, శనగ, జొన్న, పుచ్చకాయ, మిర్చి పంటలకు నష్టం వాటిల్లింది. అధికారులు సర్వే నిర్వహించి నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

## ముథోల్ మండలంలో..

ముథోల్, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మక్క పంట పూర్తిగా నెలకొరిగింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పంట సర్వే నిర్వహించి, నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.


తానూర్‌లో నేల కొరిగిన జొన్న పంట